

వివాహానికి అడ్డొస్తున్నాడనే..
యువతి వివాహానికి అడ్డొస్తున్నాడనే నవీన్‌ను హత్య చేసినట్లు జి.అన్నారంలో చర్చించుకుంటున్నారు. - 8లో



మూడేళ్లలో మూడు లక్షలు
బీబీనగర్ ఎయిమ్స్‌లో రోజూ వెయ్యి మందికి పైగా పరీక్షలు చేయించుకోవడానికి వస్తున్నారు. - 10లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 37°/25°
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.



రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6-36 (మంగళవారం సాయంత్రం)
సహర్ 4-39 (బుధవారం ఉదయం)

కొనుగోళ్లకు వేళాయే..

నేటి నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

- ఈ సీజన్‌లో కేంద్రాలకు 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా..
- 278 సెంటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయం
- కొనుగోళ్లు ప్రారంభించాలని నిర్వాహకులకు కలెక్టర్ ఆదేశం
- ఇప్పటికే కొనుగోలు కేంద్రాలకు చేరిన సామగ్రి



కనగల్ మండలం దర్వేశిపురం కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఆరబెట్టిన రైతులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఎట్టకేలకు ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమవుతున్నాయి. మంగళవారం నుంచి కొనుగోళ్లు ప్రారంభించేందుకు ప్రభుత్వం అనుమతించింది. ధాన్యం కొనుగోళ్లపై సోమవారం హైదరాబాద్‌లో మంత్రులు, ఉన్నతాధికారులు ధాన్యం కొనుగోళ్లపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా నుంచి అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. జిల్లాల్లో పరిస్థితులను బట్టి కొనుగోళ్లు చేపట్టాలని ఆ సమావేశంలో మంత్రులు, అధికారులు సూచించారు. దీంతో కేంద్రాలు వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేసుకుని.. కొనుగోళ్లకు అధికారులు, సిబ్బంది సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రం సమీపంలోని ఆర్జాలబావిలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించనున్నారు.

కొనుగోలు కేంద్రాలకు భారీగా ధాన్యం
జిల్లాలో 15 రోజుల కిందటే కోతలు ప్రారంభమయ్యాయి. పెద్ద ఎత్తున ధాన్యం మార్కెట్‌కు వస్తోంది. కల్లాల్లో ధాన్యం రాసులు పోసుకొని రైతులు ఎదురు చూస్తున్నారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసే కల్లాల్లో ఇప్పటికే 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉంది. ఈ నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో రేపటి నుంచి జిల్లాలో కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి.

13 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా..
జిల్లాలో ఈ యాసంగిలో మొత్తం 13 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. అందులో 6 లక్షల మెట్రిక్ టన్నులు సన్నాలు కాగా 7లక్షల మెట్రిక్ టన్నుల సాధారణ రకం ధాన్యం వస్తుందని అంచనా వేశారు. సన్నాలను మిల్లర్లు కొనుగోలు చేస్తుండగా సాధారణ రకం ధాన్యం మాత్రం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా ఖరీదు చేయాల్సి ఉంది. జిల్లాలో బోరుబావుల కింద సాగు చేసిన రైతులు 15 రోజుల కిందటే కోతలు ప్రారంభించడం, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో కొందరు రైతులు దళారులను ఆశ్రయించి అమ్ముకుంటున్నారు. మిల్లర్లు కూడా సాధారణ రకానికి క్వింటాల్‌కు రూ.1700లోపే ధర చెల్లిస్తుండడంతో రైతులు నష్టపోవాల్సి వస్తోంది.

పీఏసీఎస్, ఐకేపీ, మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో..
జిల్లాలో గత సీజన్‌లో నిర్వహించిన కొనుగోలు కేంద్రాలను తిరిగి ప్రారంభించాలని జిల్లా అధికారులు నిర్ణయించారు. అవసరాలను బట్టి కేంద్రాలు పెంచేందుకు కూడా అవకాశం ఉందని చెబుతున్నారు. ముందుగా 278 కేంద్రాలను పీఏసీఎస్, ఐకేపీ, మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించాలని నిర్ణయించారు. అవి ఆయా ప్రాంతాల్లో వచ్చే ధాన్యాన్ని బట్టి కేంద్రాలను ప్రారంభించుకోవాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

అన్ని కేంద్రాలకు సామగ్రి సరఫరా
ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఆయా కేంద్రాల్లో తూకం యంత్రాలు, టార్పాలిన్లతోపాటు గన్నీ బ్యాగులు, ప్యాడీ క్లీనర్లు, అవసరమైన ఇతర సామగ్రిని ఇప్పటికే కొనుగోలు కేంద్రాలకు సరఫరా చేశారు. 1.50 కోట్ల గన్నీ బ్యాగులు అవసరం ఉండగా ప్రస్తుతం 1.20 కోట్ల గన్నీ బ్యాగులు సిద్ధంగా ఉన్నాయి.

న్యూస్‌రీల్

మధ్యవర్తులను ఆశ్రయించొద్దు : ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం : తమ సమస్యలపై బాధితులు నేరుగా ఫిర్యాదు చేయాలని మధ్యవర్తులను ఆశ్రయించొద్దని ఎస్పీ అపూర్వరావు పేర్కొన్నారు. సోమవారం పోలీస్ గ్రీవెన్స్‌డే సందర్భంగా భూమి వివాదాలు, కుటుంబ తగాదాలు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు తీసుకోవడం, ఆన్‌లైన్ బెట్టింగ్, ప్లాట్‌ల ఆక్రమణ, సంఘాల పేరిట బెదిరించి డబ్బులు వసూలు చేయడం తదితర సమస్యలపై బాధితులు ఎస్పీకి ఫిర్యాదులు అందజేశారు. ఆ ఫిర్యాదులపై సమగ్ర దర్యాప్తు చేయాలని, ఆధారాలు సేకరించి కేసులు నమోదు చేసి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ పోలీస్ అధికాలను ఆదేశించారు. బాధితులకు న్యాయం జరిగితేనే పోలీస్ శాఖపై నమ్మకం కలుగుతుందని చెప్పారు.

గురుకుల సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ : ఏకలవ్య గురుకుల పాఠశాలలో 2023-24 సంవత్సరానికి సంబంధించి 6, 7, 8, 9వ తరగతుల్లో మిగిలిన సీట్లను భర్తీ చేయడానికి ప్రవేశపరీక్ష నిర్వహించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గిరిజన గురుకుల ఆర్‌సీఓ లక్ష్మయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈనెల 20లోగా fastses.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. ప్రవేశపరీక్ష మే 7వ తేదీన ఉంటుందని పేర్కొన్నారు.

హామీలను విస్మరించిన బీఆర్‌ఎస్



మాట్లాడుతున్న శంకర్‌నాయక్

అడవిదేవులపల్లి : ఎన్నికల హామీలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా మరిచిపోయిందని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర సోమవారం రాత్రి మండలంలోని చాంప్లాతండా, గోన్యాతండా, వస్రాంతండా, దూద్యాతండాల్లో సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీకి బుద్ధి చెప్పి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టడం ఖాయమన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ధరలను పెంచి పేదలపై మోయలేని భారం మోపిందన్నారు. కార్యక్రమంలో మిర్యాలగూడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాదిల శ్రీనివాస్, హనుమయ్య, పాతులోతు మాలు, బాగాన, మాజీ సర్పంచ్ మోతీలాల్, ధీరావత్ సైదానాయక్, పర్తియ, వినోద్, హనుమ తదితరులున్నారు.

ఫార్మా కంపెనీ అనుమతులు రద్దు చేయాలి

చండూరు : గట్టుప్పల గ్రామంలో నిర్మిస్తున్న ఫార్మా కంపెనీ అనుమతులు వెంటనే రద్దు చేయాలని కోరుతూ గట్టుపల్, వెల్మకన్నె గ్రామాల ప్రజాప్రతినిధులు, అఖిలపక్ష కమిటీ సభ్యులు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీఓ, డీపీఓలకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ గట్టుప్పల గ్రామంలో జరిగిన సభలో ఫార్మా కంపెనీ అనుమతులు రద్దు చేస్తామని హామీ ఇచ్చారని, తద్వారా కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ కోర్టులో ఫార్మా కంపెనీ యాజమాన్యం స్టే తెచ్చుకుని నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో గట్టుప్పల మండల బీఆర్‌ఎస్ పార్టీ కన్వీనర్ ఇడెం కైలాసం, వెలమకన్నె సర్పంచ్ చల్లమళ్ల వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ చాపల మారయ్య, మాజీ ఎంపీటీసీ అవ్వారి శ్రీనివాస్, కర్నాటి మల్లేశం, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బండారి చంద్రయ్య, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు భీమగాని మల్లేశం, రాపోలు సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒకే రోజు రెండు పరీక్షలు

- టెన్త్ భౌతిక, జీవశాస్త్రం ఎగ్జామ్స్‌కు గంటన్నర చొప్పున కేటాయింపు
- కాస్త ఇబ్బంది పడ్డ విద్యార్థులు



కొండమల్లేపల్లిలో పరీక్ష రాసి బయటికి వస్తున్న విద్యార్థినులు

కొండమల్లేపల్లి : పదో తరగతి వార్షిక పరీక్షల్లో భాగంగా సోమవారం ఒకే రోజు భౌతికశాస్త్రం, జీవశాస్త్రం పరీక్షను నిర్వహించారు. గతంలో పదో తరగతి పరీక్షలు 11 పేపర్లుగా.. నిర్వహించారు. ప్రస్తుతం ఆరు పేపర్లకు కుదించడంతో సైన్స్‌కు సంబంధించిన పరీక్షలు ఒకే రోజు నిర్వహించారు. సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు భౌతికశాస్త్రం, ఉదయం 11.20 గంటల నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు జీవశాస్త్రం పరీక్ష నిర్వహించారు. ప్రతి పరీక్షకు 1.30 గంటల సమయాన్ని కేటాయించారు. అయితే ఒకే రోజు ఈ రెండు పరీక్షలు నిర్వహించడంతో విద్యార్థులు కొంత ఇబ్బందికి గురైనట్లు తెలుస్తోంది. ఆయా సబ్జెక్టుల్లో భౌతికశాస్త్రంలో 12 యూనిట్లు, జీవశాస్త్రంలో 10 యూనిట్లు ఉండగా కేవలం ఒక్కో పేపర్‌కు 1.30 గంటలు కేటాయించడంతో సమయం సరిపోలేదని విద్యార్థులు పేర్కొంటున్నారు.

సమయం సరిపోలేదు



ఒకే రోజు భౌతికశాస్త్రం, జీవశాస్త్రం పరీక్షలను కేవలం 20 నిమిషాల వ్యవధిలో నిర్వహించారు. అయితే భౌతిక శాస్త్రం పరీక్ష రాసేందుకు నాకు సమయం సరిపోలేదు. అయినప్పటికీ బాగానే రాశాను. ఈ పరీక్షలో నాకు ఏ-1 గ్రేడ్ వస్తుందని అనుకుంటున్నాను.
– బి.సాయితేజ, పదో తరగతి విద్యార్థి

ప్రశాంతంగా టెన్త్ సైన్స్ పరీక్ష
నల్లగొండ : పదో తరగతి సైన్స్ పరీక్ష సోమవారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలోని 107 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. పరీక్ష కేంద్రాలను కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా, డీఈఓ భిక్షపతి సందర్శించారు. పరీక్షకు రెగ్యులర్ విభాగంలో మొత్తం 19,196 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 19,146 మంది హాజరయ్యారు. 50 మంది గైర్హాజయ్యారు. ఒకసారి ఫెయిల్ అయినవారి విభాగంలో 130 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 116 మంది పరీక్షకు హాజరు కాగా 14 మంది గైర్హాజయ్యారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



పెన్షనర్ల ధర్నాలో మాట్లాడుతున్న టీఎన్‌జీఓ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సుధాకర్

నల్లగొండ టౌన్ : పెండింగ్‌లో ఉన్న పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీఎన్‌జీఓ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సుధాకర్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మోహన్‌రావు, గోనారెడ్డి, నారాయణరెడ్డి, శ్రీశైలం, యుగంధర్‌రెడ్డి, ఆంజనేయులు, కృష్ణయ్య, నారాయణరెడ్డి, హుసేన్, సంతోష్‌రెడ్డి, యాదగిరి, వెంకట్‌రెడ్డి, మందడి శంకర్‌రెడ్డి, గజవెల్లి సత్యం, యాదా వాసుదేశ్ పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి



ప్రజావాణిలో బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నల్లగొండ : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను సత్వరం విచారించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంతోదూరం నుంచి వ్యయ ప్రయాసలకోర్చి వారి సమస్యలను ప్రజావాణి కార్యక్రమం ద్వారా పరిష్కరించుకోవడానికి వస్తున్న ప్రతిఒక్కరి దరఖాస్తుపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. భూ సంబంధిత సమస్యలు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, ఆరోగ్య శాఖ సంబంధించినవి ఎక్కువ దరఖాస్తులు వచ్చాయని.. ఆయా శాఖల అధికారులకు వాటిని పంపారు. కార్యక్రమంలో నల్లగొండ ఆర్‌డీఓ జయచంద్రారెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ధర్నా

నల్లగొండ టౌన్ : ఇళ్లు లేని నిరుపేదలందరికీ ఇళ్ల స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణం కోసం రూ.6లక్షలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు లొడంగి శ్రవణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని చెప్పి నేటికీ అమలుచేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీలో రాజకీయ జోక్యం నివారించి అర్హులకు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి బొలుగూరి నర్సింహ, ఎం. వెంగలయ్య, ఊషయ్య, వెంకన్న, రమేష్, లింగయ్య, షరీఫ్, వెంకటయ్య, శ్రీను పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

సీఎంఆర్‌ఎఫ్ స్వాహాపై దర్యాప్తు ముమ్మరం



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంఓ రవిశంకర్

మిర్యాలగూడ అర్బన్ : సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం చెరువుతండాకు చెందిన బాణావత్ లక్ష్మి, బాణావత్ జ్యోతి, దామరచర్ల మండలం జైత్రాంతండాకు చెందిన డి.నాగ పేరిట నకిలీ మెడికల్ బిల్లులతో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) డబ్బులు కాజేసిన విషయం తెలిసిందే. కాగా నకిలీ బిల్లులు సృష్టించిన మిర్యాలగూడ డాక్టర్స్ కాలనీలోని మహేష్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను సోమవారం డీఎంఓ రవిశంకర్ తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఇన్ పేషంట్, ఔట్ పేషంట్లు, మందుల బిల్లుల వివరాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా గత నాలుగేళ్లలో ఈ ఆస్పత్రికి కోనార్క్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, సూర్య జనరల్ హాస్పిటల్, తెలంగాణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, మహేష్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఇలా నాలుగు పేర్లు మార్చి ఎంతమంది పేరుతో నకిలీ బిల్లులతో సీఎంఆర్‌ఎఫ్ కాజేశారో అనే కోణంలోనూ జిల్లా వైద్యాధికారులు, అటు సీసీఎస్ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. దర్యాప్తు పూర్తయితే స్కాం ఎలా చేశారు.. ఇంకా ఎంతమందికి ఇచ్చారు.. సూత్రధారులు ఎవరు.. ఎవరి సిఫారసుతో సీఎంఆర్‌ఎఫ్ ఫైళ్లను సదరు సెక్షన్‌కు పంపారు.. అనే విషయాల గుట్టు తేలనుంది. డీఎంఓ వెంట సీహెచ్‌ఓ శ్రీనివాసస్వామి తదితరులున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మాక్‌డ్రిల్

నల్లగొండ టౌన్ : కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో సోమవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. మంగళవారం కూడా మాక్‌డ్రిల్ కొనసాగనుంది. కోవిడ్ నియంత్రణ కోసం తీసుకుంటున్న చర్యలు, వార్డుల్లో పడకలు, ఆక్సిజన్, ఐసీయూలు, టెస్టింగ్ కిట్‌ల అందుబాటు, మందుల నిల్వ తదితర అంశాలపై ప్రత్యేకంగా రూపొందించిన ఫార్మాట్‌లో పొందుపరిచి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వాటిని పరిశీలించి సలహాలు, సూచనలు, ఇతర ఏర్పాట్లపై ఆయా ఆస్పత్రులకు సూచించనుంది. అదే విధంగా ఇతర మిషన్లు, పరికరాలు, వెంటిలేటర్లు, ఆక్సిజన్ ప్లాంట్‌లను పనితీరును పరిశీలిస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్‌హెల్త్ సెంటర్‌లలో కూడా ఉన్న సౌకర్యాలను ఫార్మాట్‌లో పొందుపర్చుతున్నారు. డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, ఆశాలు, అంగన్‌వాడీలు ఎంత మంది ఉన్నారో తెలుసుకుంటున్నారు. అంబులెన్స్‌లు.. వాటి పనితీరును కూడా పరిశీలించి రెండు రోజుల పాటు నిర్వహించే మాక్‌డ్రిల్‌లో వచ్చిన నివేదికను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖకు ఆన్‌లైన్‌లో పంపించనున్నారు. జిల్లాలో ఎక్కడా కరోనా కేసులు లేనప్పటికీ దేశంలో ఉన్నపరిస్థితులను బట్టి ప్రభుత్వ ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ అన్నిమళ్ల కొండల్‌రావు తెలిపారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు

- నల్లగొండ ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్: పరీక్ష పేపర్ల లీకేజీలకు పాల్పడుతూ నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని నల్లగొండ ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగులకు ఉద్యోగాల నోటిఫికేషన్లు వేసి పరీక్ష పేపర్లు కూడా అమ్ముకుంటున్న దుర్మార్గమైన ప్రభుత్వం మరొకటి ఉండదన్నారు. కొన్ని నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం రేషన్ లబ్ధిదారులకు ఒక గింజ బియ్యం కూడా ఇవ్వడం లేదని, కేంద్రం ఇస్తున్న బియ్యాన్నే వీరు ఇస్తున్నట్లుగా చెబుతున్నారన్నారు. రేషన్ డీలర్లు చాలీచాలని కమీషన్‌తో ఇబ్బందులు పడుతున్నారని, వారికి జీతాలు ఇవ్వాలని, దుకాణాలకు అద్దె చెల్లించాలని వారి సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించినట్లు ఉత్తమ్ చెప్పారు. స్థానిక అధికార పార్టీ ఎమ్మెల్యే రైస్‌మిల్లర్లను పిలిపించి కస్టమ్ మిల్లింగ్ కింద ధాన్యం కేటాయించిన ప్రతి మిల్లుకు రూ.పది లక్షలు ఇవ్వాలని అడుగుతున్నారని ఈ విషయం మిల్లర్లు తనకు తెలిపారన్నారు. ధాన్యం కేటాయింపులకు ఎమ్మెల్యేకు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. తన మూడు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఈ ప్రాంత ప్రజలకు, వారి అభివృద్ధికి నిజాయితీతో నిబద్ధతతో పని చేశానని, మున్ముందు కూడా అదే స్ఫూర్తిని కొనసాగిస్తానన్నారు. స్థానిక రామస్వామి గట్టు వద్ద ప్రతి విలేకరికి 200 గజాల స్థలంతోపాటు ఇల్లు నిర్మించుకునేందుకు రూ.3 లక్షలు సాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు యరగాని నాగన్న, సాముల శివారెడ్డి, తన్నీరు మల్లికార్జున్, కౌన్సిలర్ల కస్తాల శ్రవణ్, కోతి సంపత్‌రెడ్డి, రాజా నాయక్, దొంగరి వెంకటేశ్వర్లు, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తుదిదశకు 'రూర్బన్'



కొండమల్లేపల్లిలోని పార్క్

- కొండభీమనపల్లి క్లస్టర్‌లో పూర్తికావొచ్చిన అభివృద్ధి పనులు
- 341పనులకు గాను.. 321 పూర్తి
- ఇప్పటికే రూ.12 కోట్లు ఖర్చు



పురోగతిలో ఉన్న మండల సమాఖ్య భవనం

దేవరకొండ : దేవరకొండ మండలం కొండభీమనపల్లి క్లస్టర్ పరిధిలో చేపట్టిన రూర్బన్ పనులు పూర్తి కావొచ్చాయి. గ్రామాలను ఆర్థికంగా, స్వయం సమృద్ధిగా మార్చేందుకు గాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో చేపట్టిన శ్యాం ప్రసాద్ ముఖర్జీ జాతీయ రూర్బన్ మిషన్ పథకం అమలు చేస్తున్నారు. కాగా.. కొండభీమనపల్లిని గిరిజన విభాగంలో క్లస్టర్‌గా ఎంపిక చేశారు. ఈ క్లస్టర్‌కు 2018 అక్టోబర్‌లో రూ.15 కోట్లు రూర్బన్ నిధులు మంజూరయ్యాయి. క్లస్టర్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు గాను అధికారులు ప్రణాళికలు రూపొందించారు. 2023 మార్చి31 వరకు అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం గడువు విధించింది. కాగా మరికొన్ని పనులు పురోగతిలో ఉండడంతో అన్ని పనులు మరో రెండు నెలల్లో పూర్తి కానున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

341 అభివృద్ధి పనులు
కొండభీమనపల్లి క్లస్టర్ పరిధిలోని దేవరకొండ, కొండమల్లేపల్లి మండలాల్లో 65 గ్రామపంచాయతీల్లో రూర్బన్ మిషన్ పథకం కింద 341 అభివృద్ధి పనులను ప్రారంభించారు. వీటిలో దాదాపు 321 పనులు పూర్తికాగా, మరో 15పనులు పూర్తయినప్పటికీ బిల్లుల చెల్లింపు జరగాల్సి ఉంది. మరో ఐదు పనులు పురోగతిలో ఉన్నాయి. కొండభీమనపల్లి క్లస్టర్ పరిధిలో 20 గ్రామపంచాయతీ భవనాలకు గాను ఒక్కో భవనానికి రూ.16లక్షల చొప్పున మొత్తం రూ.3.20 కోట్లు, రూ.50 లక్షలతో కొండమల్లేపల్లిలో కూరగాయల మార్కెట్, రూ.40 లక్షలతో పార్క్, రూ.50 లక్షలతో ఫిష్ మార్కెట్, రూ.50 లక్షలతో ఐస్ తయారీ కేంద్రం, రూ.1.33 కోట్లతో ఎల్‌ఈడీ బల్బుల ఏర్పాటుతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలు, గోపాలమిత్ర భవనాలు, ఈ-పంచాయతీ భవనాలు, బస్ షెల్టర్లు, స్మార్ట్ తరగతి గదుల నిర్మాణ పనులు చేపట్టారు. వీటిలో మరికొన్ని అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయి. ఇందుకు గాను ఇప్పటి వరకు రూ.12 కోట్లు వెచ్చించారు.

రెండు నెలల్లో పనులు పూర్తి చేస్తాం



కొండభీమనపల్లి క్లస్టర్ పరిధిలో రూర్బన్ పథకంలో భాగంగా చేపట్టిన పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. క్లస్టర్ పరిధిలో మరికొన్ని అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయి. క్లస్టర్‌లో 341 పనులకు గాను రూ.15 కోట్లు మంజూరు అయ్యాయి. కాగా ఇందులో ఇప్పటి వరకు 321 పనులకు రూ.12 కోట్లు వెచ్చించాం. పురోగతిలో ఉన్న పనులను మరో రెండు నెలల్లో పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం.
– కాళిందిని, డీఆర్‌డీఓ

క్లుప్తంగా

లారీ, బైక్ ఢీ.. బాలుడికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన మణికంఠ

మోత్కూరు : బైక్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ బాలుడు గాయపడ్డాడు. ఈ ఘటన మోత్కూరు మండలం పాటిమట్ల ఎక్స్ రోడ్డు వద్ద సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. అనాజీపురం నుంచి అతి వేగంగా వస్తున్న లారీ పాటిమట్ల ఎక్స్ రోడ్డు వద్ద దాచారం గ్రామానికి చెందిన సాదుల రాములు కుమారుడు మణికంఠ బైక్‌పై వస్తుండగా ఢీకొట్టింది. బాలుడికి తీవ్ర గాయాలు కాగా బైక్ నుజ్జు నుజ్జయ్యింది. బాలుడి 108 వాహనంలో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం


భాస్కర్ మృతదేహం

భువనగిరి : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన మండలంలోని హన్మాపురం గ్రామ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బొమ్మలరామారం మండలం చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన తుమ్మల భాస్కర్(35) సోమవారం రాత్రి 7 గంటల సమయంలో భువనగిరి నుంచి స్వగ్రామానికి బైకుపై వెళ్తున్నాడు.ఇదే సమయంలో తుర్కపల్లి నుంచి భువనగిరి వైపు అతివేగంగా వస్తున్న టిప్పర్ హన్మాపురం గ్రామ సమీపంలో బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైకుపై వెళ్తున్న భాస్కర్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై సైదులు తెలిపారు.

బంగారు ఆభరణాలు అపహరణ

సూర్యాపేట క్రైం : గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన సూర్యాపేటలో సోమవారం పట్టపగలే చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సూర్యాపేటలోని శ్రీరాంనగర్ కాలనీలో నివాసం ఉంటున్న కాంపెల్లి కిషన్‌రావు మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. సాయంత్రం వరకు తిరిగి వచ్చి చూసే సరికి ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించారు. దొంగలు కిచెన్ రూం వెనుక తలుపు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించినట్లు ఆనవాళ్లు ఉన్నట్లు బాధితులు తెలిపాడు. బీరువాలోని తొమ్మిది తులాల బంగారు ఆభరణాలు, రూ. 5వేలు చోరీకి గురయ్యాయి. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు కిషన్‌రావు తెలిపారు.

యువతి వివాహానికి అడ్డొస్తాడనే..?

- నవీన్ హత్యకు ఇదే కారణమని జీ.అన్నారంలో చర్చ
- హత్యోదంతంలో పాత్ర. సూత్రధారులపై పోలీసుల ఆరా
- పరారీలోనే నిందితులు


నవీన్ (ఫైల్)

నిడమనూరు : యువతి వివాహానికి ఎక్కడ అడ్డుపడతాడోనన్న కారణంతోనే త్రిపురారం మండలం జీ.అన్నారం గ్రామానికి చెందిన విరిగి నవీన్ (21)ను దారుణంగా హత్య చేసినట్లు ఆ గ్రామంలో చర్చ జరుగుతోంది. అన్నారం గ్రామానికి చెందిన విరిగి లక్ష్మయ్య, శారద దంపతులకు ఓ కూతురుతో పాటు నవీన్ సంతానం. కూతురుకు వివాహం కాగా, చదువు మధ్యలో మానేసిన నవీన్ మిర్యాలగూడలో బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. వీరిది వెనుకబడిన సామాజిక వర్గం కావడంతో పాటు పేద కుటుంబం. ఇదే గ్రామానికి చెందిన తాళ్ల నాగయ్య కుటుంబం మిర్యాలగూడలో కూరగాయల వ్యాపారం చేస్తోంది. నాగయ్య చిన్నకుమార్తె, నవీన్ నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు.

వ్యవహార శైలి నచ్చకనేనా..

ఏడాది క్రితం నవీన్, సదరు యువతి ప్రేమ విషయం పెద్దలకు తెలిసింది. అయితే, నవీన్ చదువు మధ్యలో మానేసి బైక్ మెకానిక్‌గా పనిచేస్తుండడం, కుటుంబ ఆర్థిక స్థితిగతులు, గతంలో అదే గ్రామానికి చెందిన సొంత సామాజిక వర్గానికి చెందిన యువతిని ప్రేమిస్తున్నానంటూ పెద్ద మనుషుల్లో పంచాయితీ జరగడం తదితర కారణాలతో యువతి కుటుంబ సభ్యులు, బంధువులు వీరి ప్రేమను తిరస్కరించారని గ్రామంలో చర్చ జరుగుతోంది. దీనికి తోడు ఇటీవల యువతికి పెళ్లి సంబంధాలు చూస్తున్నారని తెలుసుకున్న నవీన్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం, ఎక్కడ వివాహానికి అడ్డుపడతాడోనన్న ఉద్దేశంతోనే హత్య జరిగినట్లుగా గ్రామస్తులు భావిస్తున్నారు.

హత్యకు ముందే ఘర్షణ

ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో కోలుకున్న నవీన్ స్నేహితులను కలిసేందుకు ఆదివారం గుంటిపల్లికి వచ్చాడు. విషయం తెలుసుకున్న యువతి బంధువులు ఇద్దరు ఆమెను మర్చిపోవాలని నవీన్, అతడి మిత్రుడు అనిల్‌కు నచ్చచెప్పే ప్రయత్నం చేశారని, వినకపోవడంతో ఘర్షణ పడి వెళ్లిపోయారని తెలిసింది. అనంతరం అక్కడే ఉన్న నవీన్ స్నేహితులతో కలిసి మద్యం తాగుతూ ఫోన్ చేయడంతోనే మూడు బైక్‌లపై వచ్చిన యువతి బంధువులు, మరికొందరు దారుణంగా హత్య చేసినట్లు తెలుస్తోంది.

పోలీసుల దర్యాప్తు ముమ్మరం

నవీన్ హత్య చేసి పారిపోయిన నిందితులను పట్టుకునేందుకు పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ప్రత్యక్ష సాక్షులైన నవీన్ స్నేహితులను విచారించిన పోలీసులు హత్యోదంతంలో ఎవరెవరు పాల్గొన్నారని ఓ ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. అయితే, దాడిలో పాల్గొన్నది ఎంత మంది? వారంతా యువతి తరఫు బంధువులేనా? కిరాయి వ్యక్తుల సహకారం తీసుకున్నారా? సూత్రధారులు ఎవరు? యువతి కుటుంబ సభ్యుల ప్రమేయం ఉందా? ఇలా మరింత లోతుగా పోలీసులు విచారణ జరుపుతున్నట్లు తెలిసింది.

ముగిసిన అంత్యక్రియలు

ప్రేమించిన యువతి బంధువుల చేతిలో దారుణ హత్యకు గురైన నవీన్ మృతదేహానికి పోలీసులు మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన తర్వాత సోమవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. నవీన్ మృతదేహాన్ని స్వగ్రామమైన త్రిపురారం మండలం జీ.అన్నారం గ్రామానికి తీసుకువచ్చారు. సాయంత్రం అంతిమయాత్రలో పాల్గొని దహనసంస్కారాలు పూర్తి చేశారు. అయితే, గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అనుమానాస్పద స్థితిలో బాలుడు మృతి


రెహాన్ (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్ : అనుమానాస్పద స్థితిలో ఓ బాలుడు మృతిచెందాడు. మిర్యాలగూడ పట్టణంలో సోమవారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఎస్‌ఎస్‌పీ క్యాంపులో నివాసం ఉంటున్న ఎండి.సయ్యద్‌కు ఇద్దరు భార్యలు. మొదటి భార్య కుమారుడు ఎండి.సిరాజ్, రెండవ భార్య కుమారుడు ఎండి.రెహాన్(12) ఆదివారం మధ్యాహ్నం మిర్యాలగూడ శివారు ప్రాంతమైన చిల్లాపురం కాలువలో ఈత కొట్టేందుకు వెళ్లారు. సాయంత్రం ఎండి.సిరాజ్ ఒక్కడే ఇంటికి వచ్చి తమ్ముడు కనిపించడంలేదని కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో వారు రాత్రి కలువ వెంట వెతికినా రెహాన్ ఆచూకీ లభించకపోవడంతో టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, సోమవారం ఉదయం కాలువలో రెహాన్ విగత జీవుడిగా కనిపించడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతదేహాన్ని వెలికితీయించి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. రెహాన్ మృతిపై అనుమానాలు ఉన్నాయని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో ఎండి.సిరాజ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

విద్యుత్ తీగలు తగిలి డీసీఎంలోని గడ్డి దగ్ధం


రామన్నపేట : మంటలు ఆర్పిస్తున్న ఎస్‌ఐ


చిలుకూరులో దగ్ధమవుతున్న గడ్డివాములు

రామన్నపేట : ప్రమాద వశాత్తు విద్యుత్‌తీగలు తగిలి డీసీఎంలోని గడ్డి దగ్ధమైంది. ఈ ఘటన సోమవారం పల్లివాడ శివారులో జరిగింది. హైదరాబాద్‌కు చెందిన గేదెల పెంపకం దారుడు ఎన్నారం శివారులో గడ్డిని కొనుగోలు చేసి డీసీఎం వ్యాన్‌లో లోడ్ చేశాడు. పొలంలో నుంచి డీసీఎం రోడ్డు ఎక్కుతున్న సమయంలో విద్యుత్‌తీగలు తగిలి మంటలు లేచాయి. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ లక్ష్మయ్య ఫైర్‌సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. జేసీబీ సహాయంతో మంటలు అంటుకున్న గడ్డిని డీసీఎంలో నుంచి బయటకు తీయించి ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలను ఆర్పారు. పక్కనున్న పొలాలు, పశువుల కొట్టాలకు మంటల వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. డీసీఎం పాక్షికంగా దెబ్బతిన్నది.

చిలుకూరులో..

చిలుకూరు : చిలుకూరు మండల కేంద్రంలో సోమవారం ప్రమాదవశాత్తు ఆరు ఎకరాల గడ్డివాములు దగ్ధమయ్యాయి. స్థానికంగా నివాసం ఉంటున్న దొడ్డ రమేష్, కొడారు మధులకు చెందిన గడ్డివాములు గ్రామం వెంటనే ఉన్నాయి. మధ్యాహ్నం సమయంలో గడ్డివాములకు మంటలు అంటుకుని ఒక్కసారిగా వచ్చాయి. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వెంటనే వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ అగ్ని ప్రమాదంలో దాదాపు ఆరు వేల గడ్డిమోపులు దగ్గమవ్వగా రూ.50 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

వేర్వేరు చోట్ల పీడీఎస్ బియ్యం పట్టివేత


గుర్రపోడు : పోలీసులు పట్టుకున్న వాహనం

చింతపల్లి : అనుమతులు లేకుండా చింతపల్లి, గుర్రంపోడు మండలాల పరిధిలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సోమవారం పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన నీలా ప్రదీప్‌కుమార్ అక్రమంగా రేషన్ బియ్యాన్ని చింతపల్లి మండలం నుంచి తరలిస్తున్నాడు. పోలీసులకు సమాచారం అందడంతో తెల్లవారుజామున హోమంతాలపల్లి వద్ద నిఘా పెట్టగా రేషన్ బియ్యంతో వస్తున్న మహేంద్ర ట్రాలీ ఆటోను తనిఖీ చేయగా 11 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు.

పాల్వాయిలో 20క్వింటాళ్ల..

గుర్రంపోడు : నాంపల్లి మండలం పెద్దాపురం నుంచి చిర్ర యాదయ్య ఆటోలో 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మండలం మీదుగా తరలిస్తున్నాడు. మండలంలోని పాల్వాయి శివారులో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కానిస్టేబుళ్ల కిరణ్‌బాబు,మహేష్‌లు వాహనంను తనిఖీ చేసేందుకు ఆపే ప్రయత్నం చేయగా డ్రైవర్ వాహనం వదిలి పారిపోయాడు. వాహనాన్ని తనిఖీ చేయగా బియ్యం బయటపడ్డాయి. వాహనాన్ని పోలీసుస్టేషన్‌ను తీసుకువచ్చి విచారణ జరిపి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు.

పుట్టెడు దుఃఖంలో పరీక్షకు హాజరైన విద్యార్థిని


పరీక్ష సెంటర్‌కు వెళ్తున్న స్ఫూర్తి

మునుగోడు: ఇంట్లో తండ్రి మృతదేహం ఉన్నప్పటికీ పుట్టెడు దుఃఖంలో ఓ విద్యార్థిని సోమవారం ఎస్సెస్సీ పరీక్షకు హాజరైంది. మునుగోడు మండలంలోని గూడపూర్ గ్రామానికి చెందిన వీఆర్‌ఏ జిట్టబోయిన నరేందర్ (37) కుమార్తె స్ఫూర్తి నల్ల గొండలోని లిటిల్‌ఫ్లవర్ స్కూల్‌లో పదో తరగతి చదువుతుంది. జిల్లా కేంద్రంలోని సెయింట్ ఆల్ఫోన్సస్ స్కూల్‌లో ఎస్సెస్సీ పరీక్షలు రాస్తోంది. అయితే, స్ఫూర్తి తండ్రి నరేందర్ ఆదివారం గుండెపోటుతో మృతిచెందాడు. ఇంట్లో తండ్రి మృతదేహం ఉండగా.. పరీక్షకు వెళ్లలేక శోకసంద్రంలో ఉన్న స్ఫూర్తిని బంధువులు ఓదార్చి పరీక్షకు వెళ్లేలా మనోధైర్యం కల్పించారు. దీంతో స్ఫూర్తి ఉదయం పరీక్షకు హాజరై.. తిరిగి వెళ్లి తండ్రి అంత్యక్రియల్లో పాల్గొంది.

అభివృద్ధిలో ఆలేరు అగ్రస్థానం : ప్రభుత్వ విప్


సమావేశంలో మాట్లాడుతున్న గొంగిడి సునీత

బొమ్మలరామారం : అభివృద్ధిలో ఆలేరు నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలిపానని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం బొమ్మలరామారం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎస్టీ సబ్‌ప్లాన్ ద్వారా బొమ్మలరామారం, తుర్కపల్లి మండలాల్లోని పలు తండాలకు రోడ్ల పనుల నిమిత్తం నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. బొమ్మలరామారం మండలంలోని బోటిమీదితండా నుంచి తిమ్మాపూర్ వరకు రూ.2.01కోట్లు, నాగాయపల్లి నుంచి తిమ్మాపూర్ వరకు రూ.1.50కోట్లు, తుర్కపల్లి మండలం ముల్కలపల్లి నుంచి ధర్మారం దేవూజీ తండా వరకు రూ.4.50కోట్లు, పెద్దతండా నుంచి చోక్లాదండా వరకు అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి రూ.2.50కోట్లు, మేడిపల్లి నుంచి జంగారెడ్డితండా వరకు రూ.1.50లక్షలు మంజూరైనట్లు చెప్పారు. అలాగే మల్కాపూర్ – వట్టిమర్రి తండాకు రూ.2.80 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుధీర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బాల్ నర్సింహ, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, కూర వెంకటేష్, కట్టా శ్రీకాంత్‌గౌడ్, బండి మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ ఆర్టీసీ డిపోకు 19 కొత్త బస్సులు


కొత్త బస్సులను పరిశీలిస్తున్న ఎంవీఐ జిలాని

మిర్యాలగూడ టౌన్ : ఆధునిక సౌకర్యాలతో మిర్యాలగూడ డిపోకు ఇప్పటి వరకు 19 కొత్త బస్సులు వచ్చాయని డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్ తెలిపారు. సోమవారం డిపోకు వచ్చిన రెండు సూపర్ లగ్జరీలు, డిలక్స్ బస్సులను ఎంవీఐ జిలాని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ మిర్యాలగూడ డిపోకు ఇప్పటి వరకు నూతనంగా డిపోకు 14 సుపర్ లగ్జరీలు, 5 డిలక్స్‌లు వచ్చాయని తెలిపారు. ఆ బస్సుల్లో అన్నీ వసతులు ఉండటంతో దూరపు ప్రాంతాలకు సూపర్ లగ్జరీలను పంపించనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించకుండా ఆర్టీసీ బస్సుల్లో సురక్షిత ప్రయాణం చేయాలన్నారు. వారి వెంట పలువురు డ్రైవర్లు, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో వరి సాగు పరిశీలన

మోటకొండూర్: మండలంలోని మాటూర్, వర్టూర్, అమ్మనబోలు గ్రామాల్లో వరి సాగును మండల వ్యవసాయ అధికారి సుజాత, శాస్త్రవేత్తలు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వరిలో మెడ విరుపు తెగులును గుర్తించి చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ అనిల్‌కుమార్, రాజా, మధుశేఖర్, రైతులు లక్ష్మయ్య, రామచంద్రారెడ్డి, తిరుపతి, వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.


మాటూర్ గ్రామంలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి సుజాత, శాస్త్రవేత్తలు

సాగర్‌లో ఆగిన మంత్రి రోజా


మంత్రిరోజాకు శాలువా కప్పి స్వాగతం పలుకుతున్న హోటల్ యజమాని

నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్‌లో ఆంధ్రప్రదేశ్ టూరిజం, సాంస్కృతిక, యువజనశాఖ మంత్రి రోజా సెల్వమణి సోమవారం సాయంత్రం ఆగారు. హైదరాబాద్ నుంచి మాచర్ల వైపు వెళ్తూ నాగార్జునసాగర్‌లోని విజయవిహార్ అతిథిగృహంలో కాసేపు సేదదీరారు. ఈ సందర్భంగా విజయ విహార్ హోటల్ యజమాని మిట్టపల్లి శ్రీనివాస్ దంపతులు మంత్రికి శాలువా కప్పి స్వాగతం పలికారు. వచ్చే ఏడాది ఇరు రాష్ట్రాల పర్యాటక శాఖ ఎండీలు, అటవీశాఖ అధికారులతో మాట్లాడి శ్రీశైలానికి లాంచీలు నడిచేలా చర్యలు తీసుకోనున్నట్లు మంత్రి తెలిపారు.

కోదాడ పట్టణ సీఐ బదిలీ

కోదాడరూరల్: కోదాడ సీఐగా పనిచేస్తున్న శివశంకర్ సూర్యాపేట డీఎస్పీకి బదిలీ అయ్యారు. మునగాల సీఐగా పనిచేస్తున్న ఆంజనేయులు కోదాడ పట్టణ సీఐగా రానున్నారు. నూతన సీఐ బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. కాగా శివశంకర్ 7నెలలు మాత్రమే సీఐగా కోదాడలో పనిచేశారు.

హైదరాబాద్‌లో థీమ్ పార్కు కార్యాలయం సందర్శించిన బౌద్ధభిక్షువు


బౌద్ధ వారసత్వ థీమ్ పార్కు కార్యాలయంలో కంబోడియా బౌద్ధభిక్షువు హర్షవర్ధన్

నాగార్జునసాగర్: సంబుద్ధ గ్లోబల్ ఫౌండేషన్ క్రెటియా పగోడా(కంబోడియా) బౌద్ధ విహారానికి చెందిన బౌద్ధ భిక్షువు హర్షవర్ధన్ హైదరాబాద్‌లోని బౌద్ధ వారసత్వ థీమ్ పార్కు ప్రధాన కార్యాలయాన్ని సోమవారం సందర్శించారు. ఆయనకు బుద్ధవనం ప్రత్యేకతను స్పెషల్ ఆఫీసర్ మల్లెపల్లి లక్ష్మయ్య వివరించారు. ఆయనకు బుద్ధిష్ట్ ఎక్స్‌పర్ట్ కన్సల్టెంట్ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి తాను రాసిన బుద్ధిస్ట్ ఆర్కియాలజీ ఇన్ తెలంగాణ పుస్తకాన్ని బహూకరించారు. బౌద్ధభిక్షువు హర్షవర్ధన్ మంగళవారం బుద్ధవనాన్ని సందర్శించేందుకు నాగార్జునసాగర్‌కు వస్తున్నట్లుగా మల్లెపల్లి లక్ష్మయ్య తెలిపారు. కార్యక్రమంలో కె.కె.రాజా, రాష్ట్రపాల్ పాల్గొన్నారు.

విద్యార్థులను చితకబాదిన ఉపాధ్యాయుడు


గాయపడిన బాలుడితో తల్లిదండ్రులు

మోత్కూరు : ఓ ఉపాధ్యాయుడు విద్యార్థులను చితకబాదడంతో ఒకరి చేయి పగులు పట్టింది. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ గురుకుల ఎస్సీ బాలుర పాఠశాలలో ఆలస్యంగా వెలుగుచూసింది. కొత్త బస్టాండ్ వద్ద గల ఎస్‌వీ కళాశాలలో నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలలో ఈ నెల 5వ తేదీన విద్యార్థులు గొడవ చేస్తున్నారని చందుతో పాటు మరో నలుగురిని సైన్స్ ఉపాధ్యాయుడు అంజిరెడ్డి చితకబాదాడు. దీంతో చందు ఎడమ చేయి దగ్గర దెబ్బ గట్టిగా తాకడంతో అక్కడ కీలు వద్ద పగులుడు పట్టింది. ఈ నెల 8వ తేదీన అతని తల్లిదండ్రులు జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన మామిడి వెంకన్న, నిరోజలకు సమాచారం తెలిసి వచ్చి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకటస్వామిని అడిగారు. జరిగింది పొరపాటే అని ప్రిన్సిపాల్ చెప్పారు. తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పాఠశాలలో ఉండే నర్సు ఎక్స్‌రే తీయించి వైద్యం చేయించి బాధిత విద్యార్థి చందుకు కట్టు కట్టించారు.బాధ్యుడైన ఉపాధ్యాయుడు అంజిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని గురుకుల పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ పేరాల వెంకన్న, ప్రతినిధులు మద్దెల మహేష్, మల్లయ్య, కూరెళ్ల రామనర్సయ్య, సీఆర్‌పీఎఫ్ ప్రతినిధులు ఎర్ర యాదగిరి డిమాండ్ చేశారు. కేసు ఉపసంహరించుకున్నట్లు బాధిత విద్యార్థి తల్లిదండ్రులు తెలిపారు.

ఉపాధి కూలీలకు 200రోజులు పనిదినాలు కల్పించాలి

భువనగిరిటౌన్: ఉపాధిహామీ కూలీలకు 200రోజులు పనిదినాలు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఉపాధిహామీ కూలీల హక్కుల సాధనకు రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సలిగంజి వీరస్వామి, అశోక్, చెక్క వెంకటేశం, ఇమ్రాన్ పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం, సీపీఐ నాయకులు

పశువుల పెంటతో భూసారం పెంపు

- తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు
- పెద్దవూర ఏఓ సందీప్

పాడి పంట


పశువుల పెంటను ట్రాక్టర్‌లో నింపుతున్న కూలీలు


పెంటను వ్యవసాయ పొలంలో కుప్పలుగా పోస్తున్న రైతులు

పెద్దవూర: ప్రస్తుతం రైతులు అధిక శాతం రసాయన ఎరువుల ద్వారానే పంటలను సాగు చేస్తున్నారు. దీంతో నేలలోని పోషకాల నిల్వల్లో సమతుల్యం లోపించి ఉత్పాదక శక్తి తగ్గుతోంది. చీడపీడలు ఆశించడం, సూక్ష్మ పోషకాల లోపాలతో దిగుబడులు తగ్గుతున్నాయి. ఈ సమస్యను అధిగమించాలంటే సేంద్రియ పద్ధతులను పాటించాలని మండల వ్యవసాయ అధికారి కె.సందీప్ సూచిస్తున్నారు.

సేంద్రియ ఎరువులతో..

పశువులు, మేకలు, గొర్రెల పెంట పంటల సాగుకు ఎంతగానో ఉపయోగపడతాయి. ఇది సేంద్రియ ఎరువుతో సమానం. దీనిని దుక్కులు దున్నడానికి ముందే పంట భూముల్లో వేసి దున్నితే చాలా మంచిది. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడానికి వీలవుతోంది. దుక్కులు దున్నిన తర్వాత పశువుల పెంట మొత్తం భూమిలోకి వెళ్లి పంట దిగుబడిని పెంచడానికి దోహదపడుతుంది. పంట ఎదుగుదల, మొక్కలు బలంగా ఉండేందుకు పశువుల పెంట ఉపయోగపడుతుంది. ఎకరానికి నాలుగు నుంచి ఐదు ట్రాక్టర్ల పశువుల పెంటను వినియోగించాలి.

భూసారం పదిలం

సాధారణంగా రైతులు వేసవిలో పశుల ఎరువును వ్యవసాయ పొలాలకు తరలిస్తుంటారు. అదే సమయంలో ఎండలు ఎక్కువగా ఉంటాయి. అధిక ఎండల కారణంగా పొలంలో వెదజల్లితే వాటిలోని పోషకాలు ఆవిరి అవుతాయి. పశువుల పెంటను పొలంలో కుప్పలుగా పోసుకోవాలి. భూమిలో తగిన తేమ ఉన్న సమయంలోనే వెదజల్లి వెంటనే దుక్కిలో కలియదున్నాలి. దీనివలన భూసారం పెరుగుతుంది. భూమి గుల్లబారడానికి తోడ్పడుతుంది. సహజసిద్ధమైన లవణాలు అందుతాయి. నేలలోని ఆమ్లత్వం, క్షారత్వం, నీటిని నిల్వ ఉంచే గుణాన్ని అదుపు చేసి మొక్కలకు అందేవిధంగా సహాయపడతాయి. దీంతో రైతులు తక్కువ ఖర్చుతో అధిక లాభాలు సాధించవచ్చు.

ఇలా దుక్కి దున్నాలి

దుక్కిని ఎలా పడితే అలా దున్నడం వల్ల సాగు చేసే పంటలకు నష్టం వాటిల్లుతుంది. రైతులు వేసవికాలంలో మెట్ట భూములను వానాకాలం సీజన్ కోసం సన్నద్ధం చేస్తుంటారు. వేసవిలో వచ్చే అధిక వర్షాలకు ఎంతో సారవంతమైన మట్టి నీటి వరదకు వాలు ప్రాంతంలో కొట్టుకుపోతుంది. దీంతో మెట్ట ప్రాంతాల్లో భూమి వాలుకు అడ్డంగా దుక్కి చేయాలి. వాలుకు అడ్డంగా దుక్కి దున్నితే నీటి ప్రవాహం తగ్గి మట్టి కొట్టుకుపోకుండా ఉంటుంది.